# జీవితచిత్రాలు



సిహెచ్.సియస్. శర్మ

# జీవిత చిత్రాలు

**ఆ**దిత్య... రచ్చ అడుగు ముందు కారును ఆపి దిగాడు.

అరుగు మీద యిరువురు వయస్సు మీరిన పెద్దలు కూర్చొని చుట్ట దమ్ము లాగుతూ ఏదో మాట్లాడుకొంటున్నారు.

ఆదిత్య... అరుగును సమీపించాడు. వారిరువురూ ముఖాలను చిట్లించి ఆదిత్యను పరీక్షగా చూచారు.

తాతా!... భాస్కర్ యిల్లు ఎక్కడ?... అడిగాడు.

“ఏ భాస్కరూ!...” యిరువురిలో ఒకతను అడిగాడు.

“మంచినేని...”

“ఓ... మంచినేని భాస్కరా!...” రెండవ వ్యక్తి అడిగాడు.

“అవునండి!...”

“మీరెవరు?...” మొదటి వ్యక్తి అడిగాడు.

“నేను... అతని బాల్య స్నేహితుణ్ణి. చూడాలని వచ్చాను.” చిరునవ్వుతో చెప్పాడు ఆదిత్య.

“వాడు నా మనవడే... నాతో రా. మా యింటికి పోదాం.” అరుగు దిగాడు ఆ పెద్దాయన.

“తాతా!... కార్లో కూర్చోండి. వెళదాం.”

కారును సమీపించి... డోర్ తెరచి...

“కూర్చోండి తాతయ్యా!...” అన్నాడు ఆదిత్య.

ఆ తాతయ్య... కార్లో కూర్చున్నాడు.

ఆదిత్య కార్లో కూర్చుని స్టార్ట్ చేశాడు. తాతగారు చెప్పిన దిశలో ఆదిత్య కారు నడిపి ఐదు నిముషాల్లో వారి యింటిని సమీపించారు.

"బాబూ!... కారు ఆపు. అదే మా యిల్లు."

ఆదిత్య... కారును కాంపౌండ్ గోడ ప్రక్కగా ఆపి... దిగాడు. తాతగారి వైపు డోర్‌ను తెరిచాడు. వారు దిగారు.

గేటును తెరచి...

"రా బాబూ... రా!..." తాతయ్య ఆప్యాయంగా చెప్పారు.

యిరువురూ... యింటి ముందున్న ఆవరణాన్ని దాటి వరండాలో ప్రవేశించారు.

"కూర్చో బాబూ!... అవునూ, నీ పేరేమిటి?..."

"ఆదిత్య..."

ఆదిత్య కుర్చీలో కూర్చున్నాడు. చుట్టూ కలయజూచాడు. దాదాపు నాలుగు గ్రవుండ్ల స్థలం. యింటి ముందు రెండు గ్రవుండ్ల స్థలం.... టెంకాయ చెట్లు రకరకాల పూల మొక్కలు, చెట్లు, కాంపౌండు వాల్ ప్రక్కన క్రమంగా నాటబడి ఏపుగా పెరిగి వున్నాయి.

తాతయ్యగారు కుర్చీలో కూర్చున్నారు.

"బాలా!..." కాస్త హెచ్చుస్థాయిలో పిలిచాడు.

రెండు నిముషాల్లో... అరవై ఐదేళ్ల పండు ముత్తయిదువు వరండాలోకి వచ్చింది. సాక్షాత్ పార్వతీ మాతలా వుంది.

'తాతయ్యగారి యిల్లాలు కాబోలు...' అనుకొన్నాడు ఆదిత్య...

లేచి... చేతులు జోడించి... "నమస్తే అమ్మా!..." అన్నాడు.

ఆమె... చేతులు జోడించి... "నమస్తే బాబు!... కూర్చో" అంది.

"బాలా!... యీ అబ్బాయి మన భాస్కర్ స్నేహితుడట. మనోడికి చెప్పి, రమ్మను."

"అలాగే!..." ఆమె లోనికి వెళ్ళిపోయింది.

కొద్దిక్షణాల్లో టవల్‌తో తల తుడుచుకొంటూ పంచకట్టుతో భాస్కర్ వచ్చాడు. ఆదిత్యను చూచి గుర్తు పట్టలేక పోయాడు.

ఆదిత్య పరిస్థితీ... అంతే. వాళ్ళిరువురూ కలసి దాదాపు యిరవై సంవత్సరాలయింది. తన్నే పరీక్షగా చూస్తూ...

"మీరు!... అడిగాడు భాస్కర్.

"భాస్కర్!... నేను ఆదిత్యను." లేచి నవ్వుతూ చెప్పాడు ఆదిత్య.

"ఓ... ఆదిత్యా!... నీవా!... ఎంత కాలమయిందిరా!... నేను నిన్ను గుర్తు పట్టలేక పోయాను." నవ్వుతూ చెప్పాడు భాస్కర్.

"నిన్ను చూచిన తొలి క్షణంలో... నా పరిస్థితీ అంతే... కానీ నేను నిన్ను మరువలేదు. మన చిన్ననాటి జ్ఞాపకాలు నా మనస్సు నిండా వున్నాయి. అందుకే... నిన్ను చూడాలని వచ్చాను."

"ఆదీ!... నాకు చాలా ఆనందంగా వుంది రా. నా గదిలో కూర్చొని మాట్లాడుకుందాం రా!..."

ఆదిత్య చేతిని తన చేతిలోకి తీసుకొన్నాడు ఆప్యాయంగా.

ఇరువురూ... భాస్కర్ గది వైపుకు నడిచారు.

వారికి... భాస్కర్ చెల్లెలు సుధ ఎదురయింది.

"ఏయ్!... సుధా!... వీణ్ణి బాగా చూడు. ఎవరో చెప్పు" నవ్వుతూ అడిగాడు భాస్కర్.

సుధను చూచి ఆదిత్య అయోమయస్థితిలో నిలబడి పోయాడు. సుధ పరిస్థితీ అంతే. కొన్ని క్షణాలు ఆదిత్య ముఖంలోకి చూచి తలను ప్రక్కకు త్రిప్పుకొంది.

"ఎవరయ్యుటారబ్బా!..." అనే ఆలోచనలో మునిగిపోయింది సుధ.

యిరవై సంవత్సరాల క్రింద ఆ మిత్రులు యిరువురూ విడిపోయిన సమయానికి సుధ వయస్సు నాలుగు సంవత్సరాలు.

భాస్కర్ ఆది వైపుకు తిరిగి... "ఏరా!... నీవు గుర్తు పట్టావా!..." నవ్వుతూ అడిగాడు.

యధార్థానికి ఆదిత్యకు ఆమె ఎవరన్నది గుర్తుకు రాలేదు. కానీ... భాస్కర్‌కు ఒక చెల్లి వున్నదన్న విషయం గుర్తుంది. ఆ జ్ఞాపకంతో...

"నీ చెల్లి... సుధ కదూ!..." సందేహంతోనే చెప్పాడు.

"యస్!... యు ఆర్ రైట్." కిలకిలా నవ్వాడు భాస్కర్.

క్షణం తర్వాత... "సుధా!... వీడు నా స్నేహితుడు ఆదిత్య. మేము విడిపోయి

యిరవై సంవత్సరాలయింది. అప్పుడు నీ వయస్సు నాలుగు సంవత్సరాలు. మా వయస్సు తొమ్మిది సంవత్సరాలు. నీవు ఎంత ఆలోచించినా... వీణ్ణి గుర్తించే అవకాశం లేదమ్మా!..."

"అలాగా!..." నవ్వుతూ అంది సుధ.

"అవును."

సుధ... నవ్వుతూ ఆదిత్య ముఖంలోకి చూచింది.

"నమస్తే..." చేతులు జోడించింది.

ఆదిత్య చిరునవ్వుతో అదే పదాన్ని చెప్పాడు.

"సుధా!... టిఫిన్ రడీయ్యా!..." అడిగాడు భాస్కర్.

"అయిందన్నయ్యా!... వస్తారా. వడ్డిస్తాను. సార్!... మీరూ రండి." ప్రీతిగా చెప్పింది సుధ.

ఆదిత్య చిరునవ్వుతో తల ఆడించాడు.

"నీవు అరెంజ్ చెయ్యి. నేను వీడు ఫైవ్ మినిట్స్‌లో వస్తాము."

"అలాగే అన్నయ్యా!..." సుధ లోనికి వెళ్లిపోయింది.

ఐదున్నర అడుగుల ఎత్తు. తెల్లని దేహచ్ఛాయ. పొడుగాటి కురులు. సాంప్రదాయబద్ధమైన చీరా రవిక... నొసటన సిక్కర్ బొట్టు, చెవులకు బంగారు జంకీలు, ఒక చేతికి నాలుగు బంగారు గాజులు, కుడి చేతికి వాచ్ చంద్రబింబం లాంటి ముఖము. మాటల్లో ఎంతో సౌమ్యత... సుధను చూచిన ఎవరికైనా తోచేది అందాలబొమ్మ అని. ఆ భావనే కలిగింది ఆదిత్యకు.

భాస్కర్ వెనకాల అతని గదిలోకి నడిచాడు ఆదిత్య.

"టిఫిన్ చేసి గదిలో కూర్చొని అన్ని విషయాలూ స్థిమితంగా మాట్లాడు కొందాం ఆది. అమ్మా నాన్న శ్రీశైలం బంధువుల వివాహానికి వెళ్లారు. యీ రోజో రేపో సాయంకాలానికల్లా వస్తారు. తాతయ్యను నాయనమ్మను నీవు చూచావుగా." చెప్పాడు భాస్కర్.

"అవును." అన్నాడు ఆదిత్య.

భాస్కర్ బనీన్ వేసికొని, పంచ మార్చుకొని... తల దువ్వుకొని...

"పద... టిఫిన్ చేసి వద్దాం." అన్నాడు.

యిరువురు మిత్రులు డైనింగ్ రూమ్‌కు వెళ్లారు. సుధ, బాలమ్మలు వారికి

టిఫిన్ పెట్టారు. దోశలు కొబ్బరి చెట్నీ.

"సిగ్గు పడకుండా తిను బాబు. యిది నీ యిల్లే అనుకో." అంది బాలమ్మ.

సుధ బాలమ్మ సూచన మేరకు యిరువురికీ కొసరి కొసరి వడ్డించింది.

వారి ఆప్యాయతకు ఆదిత్య ఆశ్చర్యపోయాడు. వారు టిఫిన్ తినడం ముగించే సరికి సుధ రొండు గ్లాసుల్లో వేడి పాలను వారి ముందు వుంచింది.

యిరువురూ పాలు తాగి... భాస్కర్ గదిలో ప్రవేశించారు. సోఫాలో కూర్చున్నారు.

"ఆదీ!... ముందు నీ కథ నాకు చెబుతావా లేక నా కథ నీక చెప్పనా!..." అడిగాడు భాస్కర్.

"ముందు నీ కథను నాకు వినిపించు భాస్కరా!..." అన్నాడు ఆదిత్య.

"సరే!... నీకు తెలిసిన విషయం. అమ్మా నాన్నలకు నేను సుధ పిల్లలం. మీ కుటుంబం యీ వూరిని వదలి వెళ్లేనాటికి నాన్నగారు యస్.ఐ. మీరు వెళ్లిన నాలుగు సంవత్సరాలకు... ప్రమోషన్ మీద నాన్నగారికి వైజాగ్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. నా స్కూలింగ్ అంతా అక్కడే జరిగింది. నెలకు ఒకసారి వచ్చి నాన్నగారు తాతయ్య నానమ్మలను చూచి వారికి కావలసినవి ఏర్పాటు చేసి... తిరిగి వైజాగ్ వస్తుండేవారు. నేను సుధ... శలవుల్లో యిక్కడికి వచ్చి వారితో... యీ పల్లె వాతావరణంలో ఎంతో ఆనందంగా గడిపేవాళ్ళం. శలవలు ముగియగానే నాన్న అమ్మా వచ్చేవాళ్ళు... వాళ్ళతో వైజాగ్ వెళ్ళిపోయేవాళ్ళం.

ఆ కారణంగా చిన్నతనం నుంచీ... నాకు సుధకు పల్లెటూరు అన్నా, యిక్కడి వాతావరణం... చుట్టూ వున్న పొలాలు, తోటలు, చెరువు, రామాలయం... కల్లాకపటం లేని యీ పల్లె ప్రజలు... వారందరికీ మా కుటుంబం మీద వున్న అభిమానం... వారితో కలసి గడిపే రోజులు అంటే ఎంతో యిష్టం. యీ విషయంలో అమ్మా నాన్నల అభిప్రాయం కూడా అదే.

తాతయ్య గోపాలయ్య... స్వాతంత్ర్య సమరంలో పూజ్య గాంధీజీ గారితో కలసి... యీ ప్రాంతంలో వుద్యమాల్లో పాల్గొన్నవారు. వారు ఆ కాలంలో లెవెన్త్ వరకూ చదివిన వారు. దేశాభివృద్ధికి పురోగతికి... రైతు వెన్నెముక అనే సిద్ధాంతాన్ని నమ్మినవారు. వారి తండ్రిలాగే వారూ వ్యవసాయ వృత్తినే చేపట్టారు.

వుద్యమదారులను తెల్లదొరలు జైలుపాలు చేశారు. రొండు మూడు సార్లు

తాతయ్య జైలుకు కూడా వెళ్ళారు.

స్వాతంత్ర్యం వచ్చాక మన ప్రభుత్వం తాతయ్యను స్వాతంత్ర్య సమరయోధుడుగా గుర్తించి... ఐదు ఎకరాల భూమిని యిచ్చింది. వున్న ఐదు ఎకరాలు వచ్చిన ఐదెకరాలలో వ్యవసాయాన్ని సాగిస్తూ... పౌరరక్షణకు మూలం అయిన పోలీస్ అంటే ఆయనకు ఎంతో యిష్టం అయిన కారణంగా... నాన్నగారిని పోలీస్‌గా చేశారు.

కాలక్రమేణా రాజకీయాల్లో జరిగిన మార్పులు... నీతి నిజాయితీ న్యాయం ధర్మం... వీటిపట్ల రాజకీయ నాయకులకు వున్న అభిప్రాయాను సారంగా... తన వుద్యోగ నిర్వహణలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని... అలసిన మనస్సుతో పది సంవత్సరాల క్రింద డి.యస్.పి హోదాలో వుండగా... అన్యాయ చర్యలకు వచ్చే రాజకీయ వత్తిడిలను భరించలేక... నాన్నగారు తన వుద్యోగానికి... వాలెంట్రీ రిటైర్‌మెంట్ తీసుకొని గ్రామానికి వచ్చి... తాతయ్యకు అండగా వ్యవసాయాన్ని సాగిస్తూ... నన్నూ... చెల్లెనీ మా యిష్టానుసారంగా చదివించారు.

నేను... ఐదేళ్ల క్రింద యం.బి.బి.యస్ పూర్తి చేసి తాతయ్య నాన్నగార్ల యిష్టానుసారంగా యీ గ్రామంలో ఓ చిన్న హాస్పటిల్‌ను నడుపుతున్నాను. చెల్లి సుధ... యం.ఏ. బి.య్యి.డి పూర్తి చేసి యీ వూరి హైస్కూల్లో టీచర్‌గా పనిచేస్తూ వుంది.

కన్న తల్లిదండ్రులను కళ్ళను చూచుకున్నంత జాగ్రత్తగా చూచుకోవాలన్నది... నాన్నగారి సిద్ధాంతం. నాన్న... తన తల్లిదండ్రుల విషయంలో తన సిద్ధాంతాన్ని తుచ తప్పకుండా పాటిస్తున్నారు.

వారికి వారుసుడనైన నేను... నా చెల్లి, నా తల్లి దండ్రుల విషయంలో అలాగే వర్తించాలనేది మా యిరువురి నిర్ణయం. ఆ కారణంగా నేను... యీ పల్లె జీవితాన్ని అభిమానిస్తున్నాను. ఈ పేద ప్రజలకు సేవ చేస్తూ ఆనందిస్తున్నాను.

నాతో యం.బి.బి.యస్ చేసిన కిషోర్ అనే వాడు యం.డి చేసేదానికి అమెరికాకు వెళ్లాడు. వాడికి అక్కడ ఒక ఈస్ట్‌గోదావరి పిల్ల ఆమె కూడా యం.డి చేసేటందుకు వెళ్లినదే... వీడికి పరిచయం అయింది. కొద్దిరోజుల్లో ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆవేశంతో యిరువురూ ఒకటైనందున... ఆ పిల్లను వాడు పెళ్లి చేసికోవలసిన పరిస్థితి ఏర్పడింది.

ఆ విషయాన్ని తల్లిదండ్రులకు ఫలానా పిల్లను నేను ప్రేమించాను. వివాహం చేసికోదలచానని తెలియజేశాడు.

వాడి తల్లిదండ్రులు... ఈస్ట్ గోదావరి జిల్లాకు వెళ్లి, ఆ పిల్లల తల్లిదండ్రులను గురించి విచారించగా కులాల తేడా కారణంగా వారు... వాడి వివాహాన్ని ఆ పిల్లతో అంగీకరించలేదు.

ఫలితంగా క్షణికావేశంతో వాడు చేసిన తప్పు కారణం, ఆమె గర్భవతి అయినందున... తల్లిదండ్రులను ధిక్కరించి, వాడు ఆ పిల్లను పెండ్లి చేసుకొన్నాడు. తల్లిదండ్రుల తత్వాల్లో  మార్పు రానందున.... వాడు ఆమె అమెరికాలోనే వుండిపోయారు.

ఒక్కగానొక్క కొడుకు... యీ రీతిగా రెక్కలు వచ్చాక... తన దారి తాను చూచుకొన్నందుకు ఆ తల్లిదండ్రులు ఎంతగానో కుమిలిపోయారు. అవమానంతో సాటివారి మధ్యన ఎంతగానో బాధపడ్డారు. కొడుకు మీద వున్న పిచ్చిప్రేమ అభిమానం కారణంగా ఆ తల్లి మనోవ్యధతో కళ్ళు మూసింది.

అంత దూరంలో వున్నా వాడు... ఆమె అంతిమ సంస్కారానికి కూడా రాలేకపోయాడు... అదే సమయానికి వాడి భార్య ప్రసవవేదనలో వున్నందువలన.

“కొడుకు చేయవలసిన తల్లి అంతిమ విధానాలను ఆ తండ్రే నిర్వహించాడు.”

“ఆదిత్యా!... అంతిమ దశలో ఆ తల్లి మనస్సు వాడి కారణంగా ఎంతటి వేదనను అనుభవించిందో... వాడిని చూడాలని ఆ తల్లి ఆత్మ ఎంతగా పరితపించిందో ఎవరికీ వూహకు అందని విషయం కదూ!...

ప్రతి మనిషికీ మనుగడకు మనీ... అవసరం. దాని సంపాదన ముఖ్యం. ఆ ఆశ హద్దుల్లో వుంటే మంచిది. హద్దు మీరిన ధనఆర్జనా కాంక్ష... ఆనందాన్ని కలిగించలేదు. దానికి వాడి జీవితమే సాక్షి. అమెరికాలో లక్షలు సంపాదించవచ్చు. ఆ లక్షలతో పోయిన తల్లిని బ్రతికించగలడా!... ఆ తల్లిని వాడు శాశ్వితంగా మరచిపోగలడా!... ఆమె గుర్తుకు వచ్చినప్పుడు వాడికి ఆవేదన వుండదా!...

వాడిని తలుచుకొన్నప్పుడు నాలో వుత్పన్నం అయ్యే ప్రశ్నలివి.

“వాడి కథ మూలంగా నేను గ్రహించింది... కేవలం ధనార్జనే ముఖ్యం... అనే నిర్ణయంతో వర్తించే వారికి... బాంధవ్యాలు బంధుత్వాలు... ప్రేమాభిమానాలు వుండవనే నిర్ణయానికి వచ్చాను” ఎంతో ఆవేశంగా చెప్పిన భాస్కర్ చెప్పడాన్ని

ఆపాడు. కళ్ళు మూసుకొన్నాడు.

పుట్టిన వూరు... ఆ గ్రామ ప్రజలు... ఆ పరిసరాలు తన కుటుంబ సభ్యుల మీద భాస్కర్‌కు వున్న గౌరవం... ఆదరాభిమానాలను అతని మాటల్లో విన్న ఆదిత్య... అతనిలోని మానవతా వాదానికి ఎంతగానో సంతోషించాడు. తన బాల్యస్నేహాన్ని గుర్తుంచుకొని... ఎంతో అభిమానంతో పలకరించి స్నేహానికి వున్న విలువను ఆదరించినందుకు ఆనందించాడు. భాస్కర్ కళ్లు తెరిచాడు. తన్నే పరీక్షగా చూస్తున్న ఆదిత్య ముఖంలోకి చూచాడు.

"ఆదీ!... ఏం అలా చూస్తున్నావ్?..."

"నీ వ్యక్తిత్వాన్ని..."

"హుఁ... నేను మామూలు మనిషినే ఆదీ!... నాకు ఆశలు ఆశయాలు వున్నాయి. కానీ... వాటిని తీర్చుకునేటందుకు సాటివారికి ఎలాంటి బాధనూ కలిగించ కూడదన్నది నా అభిప్రాయం. పెద్దలు అంటుంటారు. మనది ఖర్మభూమి అని. ఖర్మ అంటే ధర్మం. ధర్మం అంటే... బాధ్యత. ప్రతి వ్యక్తీ వారివారి బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి కదా!...

ఆ బాధ్యతను విస్మరించి వర్తించేవారు ధర్మబద్ధులు కాలేరుగా!... నా వుద్దేశ్యంలో కిషోర్ తన ధర్మాన్ని తన స్వార్ధంతో విస్మరించాడు. వాడు వూహించని రీతిలో కష్టాల పాలైనాడు. మనశ్శాంతిని కోల్పోయాడు.

'ఋణాణు బంధరూపేణా... పశుపత్ని సుతాలయా' యిది పెద్దల మాట. ఋణం... అంటే బాకీ, అప్పు... ఎవడైతే దాన్ని చేస్తాడో, వాడు ఆ ఋణాన్ని... తీర్చుకోవాలిగా!... యీ తత్వాను సారంగా మన పునర్జన్మ సిద్ధాంతాన్ని నమ్మవలసిందే. నేను నమ్ముతున్నాను.

'జన్మరాహిత్యమే మోక్షం' అంటే యీ జన్మలో మనం మన స్వధర్మాన్ని సక్రమంగా నెరవేర్చాలి. అంటే ఎవరికీ మనం ఏ రీతిగా కూడా స్వార్థ చింతనతో తప్పు చేసి ఋణపడకూడదు. ఇది నేను నమ్మి ఆచరించే సత్యం.

నీకు నా మాటలు... ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి కదూ!... యం.బి.బి.యస్ డాక్టరయ్యుండి వీడు ఏమిటి యిలా మాట్లాడుతున్నాడని అనుకొంటున్నావు కదూ!... పెద్దల మూలాన మనకు సంక్రమించిన అక్షర జ్ఞానాన్ని... సత్యాసత్య విచక్షణకు... మన స్వధర్మాన్ని గుర్తించి ఆచరించే దానికి వుపయోగించు

కోవాలన్నది నా తత్వం. స్వార్థంతో స్వప్రయోజనాలకు, మనస్సు కోరిన రీతిగా వుపయోగిస్తే... మనం ఋణగ్రస్థులం అవుతాము. అన్ని బాధలకన్నా గొప్ప బాధ ఋణ బాధ. దాన్ని భరిస్తూ జీవితాన్ని ముందుకు సాగించడం చాలా కష్టం. అలాంటి స్థితి అంటే నాకు చాలా భయం. అందుకే... నా స్వధర్మ నిర్వహణలో నేను ఒకటికి పదిసార్లు ఆలోచించి... సమస్య పరిష్కారానికి, ఒక నిర్ణయానికి... వచ్చి ముందుకు సాగుతాను.

జన్మనిచ్చిన మన తల్లిదండ్రుల ఋణాన్ని మనం తీర్చుకోవాలంటే... యీ జన్మ, బ్రతికే కాలం చాలదని నా అభిప్రాయం. అందుకే... వాళ్ళ కళ్ళముందు వుండి వారికి ఆనందాన్ని కలిగించే రీతిలో, నా జీవితాన్ని సాగిస్తూ వున్నాను" చెప్పడం ఆపి... ఆదిత్య ముఖంలోకి చూచాడు భాస్కర్.

ఆదిత్య... కళ్ళల్లో కన్నీరు. వదనంలో ఎంతో బాధ.

"ఆదీ!... ఎందుకురా బాధపడుతున్నావ్?..." ఆత్రంగా అడిగాడు భాస్కర్. ఆది... ముఖ భంగిమను చూచిన భాస్కర్ మనస్సున ఏదో సందేహం.

"నీవు యిప్పుడు హాస్పటిల్‌కు వెళ్ళాలా!..." కర్చీఫ్‌తో కన్నీటిని తుడుచుకొని అడిగాడు ఆది.

"వెళ్ళాలి..."

"నేనూ నీతోరానా!..."

"నీవెందుకురా!... విశ్రాంతి తీసుకో. రెండు గంటల్లో వస్తాను. సుధతో చెప్పి వెళతాను. నీకు కాఫీ... టీ... ఏదైనా కావాలంటే ఆమె యిస్తుంది"

సుధ... గది వాకిటి దగ్గరకు వచ్చింది.

"అన్నయ్యా!... హాస్పటిల్‌కు వెళ్ళడం లేదా!..." అంది.

"వెళ్ళాలమ్మా. లోనికి రా, మాట."

సుధ గదిలో ప్రవేశించింది.

"అమ్మా చూడు. ఆది యిక్కడే వుంటాడు. నేను రెండు గంటల్లో వస్తాను. వీడికి కాఫీ, టీ, స్నానానికి ఏర్పాటు చెయ్యి" ఆది వైపుకు తిరిగి...

"ఆదీ!... యిది నీ యిల్లే అనుకో. మొహమాట పడకు. ఏది కావాలన్నా సుధను అడుగు. సరేనా!..." అనునయంగా చెప్పాడు.

"అలాగే..."

సుధగది నుంచి వెళ్ళిపోయింది. భాస్కర్ డ్రస్ మార్చుకొని కార్లో హాస్పటిల్‌కు వెళ్లిపోయాడు. భాస్కర్‌ను సాగనంపి... ఆది గదిలోకి వచ్చి మంచంపై వాలిపోయాడు. అతని మనస్సులో... మూగ బాధ. కళ్ళు మూసుకొన్నాడు.

❁ ❁ ❁

**క**ళ్ళను మూసుకోనవచ్చు. కానీ...మనస్సున వున్న ఆవేదనను ఎవరైనా ఎలా మరచిపోగలరు? ఆ మనస్సు ఏ విషయంలో వ్యధ చెందుతూ వుందో... అది వ్యక్తులకు సంబంధించినదైతే, వారిని కలిసేటంత వరకు... అది ఏదైనా కోర్కెకు సంబంధించినదైతే... ఆ కోర్కె తీరే వరకూ... మనస్సులోని ఆవేదన తీరదు.

పద్దెనిమిది సంవత్సరాల తర్వాత ఆ వూరికి తన తండ్రి రామచంద్రయ్యను, తల్లి సీతమ్మను, అక్క పార్వతి, తమ్ముడు ఆనంద్‌లను చూడాలని వచ్చాడు ఆదిత్య. తన యిల్లు వున్న స్థలంలో శిధిలావస్థలో వున్న గోడలు కూలి... చుట్టూ కరతుమ్మ చెట్లతో అరణ్యంలా వుంది.

తమ యింటికి ముందు వెనుక వున్న పూరి యిళ్ళ స్థానంలో... మిద్దెలు వున్నాయి. అతికష్టం మీద తన యింటి ఆనవాలును గుర్తించ కలిగాడు. పదేళ్ళ ప్రాయంలో తండ్రి తనను తన్నిన కారణం... రోషంతో అలిగి యిల్లు విడిచి... తన వారికందరికీ దూరంగా వెళ్ళిపోయాడు.

ప్రస్తుతంలో... అక్కడ తనవాళ్ళు ఎవ్వరూ లేరు. ఎక్కడున్నారో!... ఎలా వున్నారో!... వూహకు అందని విషయం.

తన బాల్య స్నేహితుడు భాస్కర్... పేరును చెప్పగానే తన్ను గుర్తు పట్టడం... ఆప్యాయంగా పలకరించి, అతని గదిలో తాను వుండ కలిగేలా చేయడం.... తన కుటుంబ కథనంతా చెప్పడం... అతనిలో వున్న మహోన్నత సంస్కారానికి ప్రత్యక్ష సాక్ష్యం. అందుకే అన్నారు కాబోలు... పెద్దలు, సృష్టిలో అన్నింటి కన్నా గొప్పది స్నేహమేనని. తొమ్మిది సంవత్సరాల వయస్సు నాటి స్నేహాన్ని యింతవరకూ మరువని... 'భాస్కర్ రియ్యలీ గ్రేట్' అనుకొన్నాడు ఆదిత్య.

"సార్!..." సుధ పిలుపు.

మనస్సులోని ఆలోచన చెదిరిపోయింది. ఆదిత్య గది తలుపు వైపుకు చూచాడు. చిరునవ్వుతో నిలబడి వుంది సుధ.

"కాఫీ... టీ... కావాలా!..."

"ఒద్దండి."

"మొహమాట పడకండి. యిది మీ యిల్లే అనుకోండి." చిరునవ్వుతో చెప్పింది సుధ.

"యధార్థం అండి. త్రాగాలని లేదు."

"మరీ... స్నానం చేస్తారా!..."

"చేస్తానండి."

వేగంగా గదిలోకి వచ్చి... బాత్‌రూమ్ తలుపు తెరచి, గీజర్ ఆన్ చేసి మూసి వెను తిరిగి... "గీజర్ ఆన్ చేశాను. పది నిముషాల్లో వెన్నీళ్ళు రడీ అవుతాయి." అంది సుధ.

"ఓకే... థ్యాంక్యూ!..."

"నో మెన్షన్ ప్లీజ్." రెండు అడుగులు ముందుకు వేసి ఆగి వెను దిరిగి... "తప్పుగా అనుకోకండి. కాఫీ తీసుకు రా నా!..." క్రీకంట చూస్తూ అడిగింది.

ఆమె భంగిమను చూచిన... ఆదిత్యకు నవ్వు వచ్చింది.

"సరే!... త్రాగి స్నానం చేస్తాను." నవ్వుతూ చెప్పాడు.

"ఐదు నిముషాల్లో వస్తాను." వేగంగా వెళ్ళిపోయింది సుధ.

యువరాణి... జోగారావు... తన జీవిత విధానాన్ని మార్చి... తాను, తన వారికి దూరం అయ్యేదానికి వారిరువురూ... కారకులు. గత జీవిత జ్ఞాపక పుటల్లో వున్న వారి పేర్లు గుర్తుకు వచ్చాయి ఆదికి.

వారు యిప్పుడు ఎక్కడ వున్నారో!... ఏ స్థితిలో వున్నారో!... వారి ఆలోచనలతో కిటికీ గుండా శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు ఆదిత్య.

సుధ కాఫీ కప్పు సాసర్‌తో వచ్చింది. తన రాకను కూడా గమనించకుండా దీక్షగా శూన్యంలోకి చూస్తున్న ఆదిత్యను కొన్ని క్షణాలు పరీక్షగా చూచింది. 'కాఫీ... చల్లారి పోతుందిగా, అనుకొని...

"సార్!... కాఫీ..." అంది.

ఆదిత్య తొట్రుపాటుతో... ఆమె ముఖంలోకి చూచాడు.

చిరునవ్వుతో సాసర్ కప్పును ఆదిత్యకు అందించింది సుధ. అదే ఆలోచనతో అందుకొన్నాడు ఆదిత్య.

"మీరు కాఫీ త్రాగేటప్పటికి వేడినీళ్లు రడీ అవుతాయి." చిరునవ్వుతో చెప్పింది

సుధ.

క్షణంసేపు ఆమె ముఖంలోకి చూచాడు ఆది. ఆలోచనలో పడిపోయి స్నానం సంగతి మరచిపోతారేమో!... అనే భావన సుధ వదనంలో ఆదికి గోచరించింది.

యువరాణి... జోగారావులను గురించి సుధను అడగాలనుకొన్నాడు. ఆమె సమాధానం కొంతవరకూ తన ఆలోచనా భారాన్ని తగ్గించగలదని అతని ఆశ. కాఫీని చిప్ చేసి...

“ఏమండీ!...”

“చక్కెర సరిపోలేదా!...” ముఖాన్ని చిట్లించి... అడిగింది సుధ.

“కాఫీ... అమృతం”

“ఆ... చక్కెర జాస్తయిందా!...” ఆశ్చర్యంతో అమాయకంగా అడిగింది.

“కాఫీ... సూపర్. నేను అడగాలనుకొన్నదీ!...”

“అదేమిటండీ?...”

“మీకు యీ వూర్లో వుండే... యువరాణి, ఆమె అన్న జోగారావు తెలుసా!...”

“ఆ... యువరాణి, యిప్పుడు... యీ వూరి సర్పంచ్. జోగారావు పదేళ్ళ క్రిందట... లోడ్ ట్రాక్టర్ ట్రయిలర్ బోల్తా పడి చనిపోయాడు.”

“వాళ్ల అమ్మా నాన్న?...”

“అమ్మ కూడా పైకి వెళ్ళిపోయి దాదాపు పదేళ్ళ కావస్తూ వుంది. కొడుకు పోయాడనే వేదనతో ఆమె కూడా వెళ్ళిపోయింది. వాళ్ళ నాన్నగారు... ఎనభై ఏళ్ళ వయస్సు... వున్నారు.” చెప్పింది సుధ.

“యువరాణికి పెళ్ళి అయిందా!...”

“కాలేదు. తను నాకంటే ఆరేళ్ళు పెద్ద.” రెండు క్షణాలు ఆగి...

“అవునూ!... నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగవచ్చా!...”

“అడగండి.”

“యువరాణి వాళ్ళు మీకు ఎలా తెలుసు?...”

“నాదీ... యీ వూరే. వుదయం భాస్కర్ చెప్పిందీ...”

“ఓ ...అయాం సారీ!...” నవ్వుతూ చెప్పి, క్షణం తర్వాత

“సార్!... వేన్నీళ్ళు...”

“రడీ అయ్యి వుంటాయి కదూ!...”

'అవును...' అన్నట్లు తల ఆడించింది సుధ.

కాఫీ కప్పును టీపాయ్ పై వుంచి... "స్నానానికి వెళుతున్నాను." సోఫానుంచి లేచాడు ఆది.

"టవల్ సోప్... బాత్‌రూంలో వున్నాయండి."

"థ్యాంక్యూ." నవ్వుతూ చెప్పాడు ఆది.

సాసర్ కప్పును తీసుకొని సుధ వెళ్లిపోయింది.

❀ ❀ ❀

స్నానం చేసి... గదిలోకి వచ్చాడు ఆది.

"సార్!... టీపాయ్ పైన వున్న షర్టు ప్యాంట్‌ను మా అన్నయ్య మీకు యిమ్మని ఫోన్ చేశాడు. ఏదో అర్జంటు కేసు వచ్చిందట. ఆయన రెండు గంటలకు వస్తానని చెప్పాడు." తలుపు వెనక నుంచి సుధ చెప్పింది.

"థ్యాంక్సండి." అన్నాడు యాంత్రికంగా ఆదిత్య.

'ఓ... ఆ కేసు యిప్పుడే రావాలా!... భాస్కర్‌తో మాట్లాడవలసిన విషయాలు ఎన్నో వున్నాయి. త్వరగా వస్తే బాగుంటుంది.' అనుకొన్నాడు ఆది.

ఆ డ్రస్‌ను వేసికొన్నాడు. తను బయలుదేరేటప్పుడు కట్టుబట్టలతో బయలుదేరాడు. తాను భాస్కర్‌ను కలవాలని... తన వూరిని చూడాలని వచ్చాడే కాని... భాస్కర్‌ని కలుస్తానని అతను వూహించలేదు. తన ప్రయత్నం ఫలించినందుకు సంతోషించాడు.

వాడు వచ్చేదానికి మరో రెండు గంటలు పట్టవచ్చు. యిలోగా వూరంతా ఒకసారి తిరిగి చూడాలని నిర్ణయించుకొన్నాడు. గది నుంచి బయటికి వచ్చాడు.

"ఏం బాబూ!... బయటికి వెళుతున్నావా!..." హాల్లో కూర్చొని వున్న బాలమ్మ అడిగింది.

"అవునమ్మా!..."

"మంచిది. జాగ్రర్తగా వెళ్లిరా!..."

"అలాగే..."

సుధ హాల్లోకి వచ్చింది. బహుశా తన కంఠ స్వరాన్ని విని వచ్చి వుండవచ్చు. ఆమె చూపులు ఆదిత్య మీదనే వున్నాయి. గ్రహించిన ఆదిత్య...

"అలా వెళ్ళి వూరంతా ఓ సారి చూచి వస్తానండి. భాస్కర్ రెండు గంటలకు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jeevita+Chitralu**

* * *